విశాలాంధ్ర కృష్ణా జిల్లా

రైతులు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు

విశాలాంధ్ర-మచిలీపట్నం : బందరు ఓడరేవుకు భూములు ఇచ్చిన రైతులు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని జిల్లా కలెక్టర్ పి రాజబాబు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ స్పందన సమావేశం మందిరంలో బందరు ఓడరేవు నిర్మాణానికి నిర్మాణం కోసం 17 ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించిన 49 మంది పోతేపల్లి గ్రామ రైతులకు 11 కోట్ల 7లక్షల 76 వేల 836 రూపాయల చెక్కులను జిల్లా కలెక్టర్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకటరామయ్యతో కలిసి అందజేసి వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడైనా మునిసిపాలిటీలలో జనాభా పెరుగుతుంది కానీ తరగదన్నారు. మచిలీపట్నం బాగా జనాభా తగ్గుతున్న నగరంగా గుర్తింపు పొందిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు ఆనందంగా ఉండే విధంగా చెల్లింపులు జరిపామన్నారు. గ్రీన్ ఫీల్డ్ ఓడరేవు నిర్మాణంలో భాగంగా రైల్ కం రోడ్డు ఏర్పాటు కోసం 47.88 ఎకరాలు అవసరం కాగా అందులో పోతేపల్లి గ్రామ రైతులు 49 మంది 17 ఎకరాలు సంబంధించి పూర్తిస్థాయిలో కావలసిన డాక్యుమెంట్లు అందజేసినందున ఆ భూమిని సేకరించి అవార్డు పాస్ చేశారన్నారు. ఎమ్మెల్యే పేర్ని వెంకటరామయ్య మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు, బందర్ పోర్టు అభివృద్ధి కోసం పోతేపల్లి గ్రామ రైతులు తమ భూమిని అంకితం చేస్తున్నందుకు వారికి మనస్ఫూర్తిగా పాదాభివందనం చేస్తున్నానన్నారు. కలెక్టర్ ఎమ్మెల్యే పేర్ని వెంకటరామయ్యను, ఆర్డీఓ ఐ కిషోర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఆర్డీఓ ఐ కిషోర్, తహసిల్దార్ శ్రీవిద్య, పోతేపల్లి రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు, రైతు సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, మరింత విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు వివిధ అంశాలపై ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని జడ్పిటిసిలు, వివిధ శాఖల అధికారులతో చైర్ పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత జరిగిన గ్రామీణాభివృద్ధి అంశంపై 2వ స్థాయి సంఘ సమావేశంలో గృహ నిర్మాణం, గ్రామీణాభివృద్ధి, ఉపాధి పరిశ్రమలు నీటి యాజమాన్యం అంశాలపై చైర్పర్సన్ సమీక్షించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద కృష్ణాజిల్లాలో 89,824 గృహాలు మంజూరు కాగా, అందులో 19,142 గృహాలు పూర్తయినట్లు, ఎన్టీఆర్ జిల్లాలో 83, 485 గృహాలు మంజూరు కాగా, 14275 గృహాలు పూర్తయినట్లు, ఏలూరు జిల్లా పరిధిలోని కైకలూరు, నూజివీడు నియోజక వర్గాల్లో మొదటి విడత 25,993 గృహాలు మంజూరు కాగా 6031 గృహాలు పూర్తయినట్లు, మిగతావి వివిధ నిర్మాణ దశలలో ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంతో కృష్ణ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించినట్లు అధికారులు నివేదికలు సమర్పించారు. అనంతరం వ్యవసాయం అంశంపై నిర్వహించిన 3వ స్థాయి సంఘ సమావేశంలో చైర్పర్సన్ మాట్లాడుతూ విత్తనం నుండి విక్రయం వరకు రైతులకు సకల సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆర్బికేలు ఏర్పాటు చేశారని అన్నారు. వీటి ద్వారా రైతులకు సమగ్ర సేవలు అందించాలన్నారు. అనంతరం విద్య వైద్యంపై 4వ స్థాయి సంఘం, స్త్రీసంక్షేమంపై 5వ స్థాయి సంఘం, సాంఘిక సంక్షేమంపై 6వ సాయి సంఘం, ప్లానింగ్ మరియు ఆర్థికం అంశంపై 1వ స్థాయి సంఘం, పనులు అంశంపై 7వ స్థాయి సంఘం సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జడ్పీ సీఈవో జ్యోతి బసు, ఆయా స్థాయి సంఘాల్లో జడ్పిటిసి సభ్యులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న గృహాల పూర్తి

విశాలాంధ్ర-మచిలీపట్నం : రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల వైయస్సార్ జగనన్న గృహాల నిర్మాణం పూర్తయిందని, మరో పది రోజుల్లో సీఎం ప్రారంభించనున్నారని, ఆలోగా నిర్మాణం పూర్తయిన అన్ని లేఔట్లలో స్వాగత తోరణాలను ఏర్పాటుచేసి, ఆ గృహాలకు విద్యుత్తు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ షా పేర్కొన్నారు. మంగళవారం జీ కన్వెన్షన్ హాలులో గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పురోగతిపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ షా మాట్లాడుతూ పేదలందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వడమే రాష్ట్ర ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. గత 40 ఏళ్లుగా ఎన్నడూ లేనివిధంగా 30.60 లక్షల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. ఇందులో మొదటి విడతలో 5 లక్షల గృహాలను నిర్మించడం గొప్ప విషయం అన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో పాలుపంచుకోవడం అందరూ గర్వంగా భావించాలన్నారు. కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ ఇల్లు ప్రతి ఒక్కరికి చాలా ముఖ్యమని, ప్రతి కుటుంబానికి గౌరవం తెచ్చి పెట్టేదన్నారు. గత 40 సంవత్సరాలుగా సాధించలేనిది ఇంత వేగంగా 5 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం గొప్ప సాధన అన్నారు. స్థానిక శాసనసభ్యులతో సంప్రదించి స్వాగత తోరణాల నిర్మాణానికి చొరవ చూపి తక్షణమే పనులు ప్రారంభించాలన్నారు. అనంతరం జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ షాను, జిల్లా కలెక్టర్ పి.రాజా బాబును, సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ ను హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణ, హౌసింగ్ అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డి ఆర్ డి ఎ బి డి పిఎస్ఆర్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ, పంచాయతీరాజ్ ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకతో కోట్లు దండుకుంటున్నారు

విశాలాంధ్ర-అవనిగడ్డ : శ్రీకాకుళంలో జరుగుతున్న ఇసుక తవ్వకాలకు అనుమతి ఉందని చెప్పే ధైర్యం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుకు ఉందా అని మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ ప్రశ్నించారు. మంగళవారం ఘంటసాల పోలీస్ స్టేషన్ వద్ద నిరాహార దీక్షకు బయలుదేరిన బుద్ధప్రసాద్ ను పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ నియోజకవర్గాన్ని దోపిడీ, దుర్మార్గాలకు కేంద్రంగా మార్చారన్నారు. రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి ఇసుక ద్వారా రూ.40వేల కోట్లు దోచుకుంటే, ఇక్కడ ఎమ్మెల్యే రమేష్ కోట్లు దోచుకున్నారన్నారు. నియోజకవర్గంలో ఏకైక త్రాగునీటి వనరుగా ఉన్న శ్రీకాకుళంలో కేవలం నాలుగు ఎకరాలకు అనుమతి పొంది నలభై ఎకరాల్లో ఇసుక దోపిడీ చేశారన్నారు. ఇసుక తవ్వకాలు ఆపాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా, తీర్పు తరువాత కూడా తవ్వుతున్న ఫోటోలతో స్పందనలో ఫిర్యాదు చేసినా జిల్లా అధికారులు పట్టించుకోలేదన్నారు. జిల్లా స్థాయి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. ఎమ్మెల్యే కనుసన్నల్లో ఇసుక దోపిడీ సాగుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదన్నారు. జేపీ వారికి గడువు ముగిసింది అంటే పోలీసులు వకల్తా పుచ్చుకుని అనుమతి ఉందంటూ తమను అడ్డుకోవడం పరిస్థితికి నిదర్శనం అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సరిహద్దుల్లో జెండాలు పాతకుండా, సీసీ కెమెరాలు, వే బ్రిడ్జి లేకుండా భారీ జేసీబీలకు, భారీ టిప్పర్లకు అనుమతి లేకపోయినా వినియోగిస్తూ, నకిలీ క్యూఆర్ కోడ్ ఫేక్ బిల్లులతో ఎమ్మెల్యే సాగిస్తున్న ఇసుక దోపిడీ కారణంగా నియోజకవర్గంలో పర్యావరణ సమతౌల్యం దెబ్బ తింటోందన్నారు. మత్స్యకారులకు, భూగర్భ జల వనరులకు, త్రాగునీటి వనరులకు నష్టం కలుగుతోందన్నారు. భారీ తవ్వకాలతో నదీ ప్రవాహ వేగంలో మార్పులు వచ్చి ఎడ్లంక, ఎదురుమొండి దీవులు మునుపెన్నడూ లేని విధంగా కోతకు గురవుతున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల సంపూర్ణ మద్దతుతో విజయం సాధించి ఈ వైసీపీ పాలనలో ఇసుక దోపిడీ చేసిన వారి నుంచి ప్రతి పైసా కక్కిస్తామన్నారు. అవినీతి పరులకు కొమ్ముకాసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర-గుడివాడ : ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో మంగళవారం స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి క్రీడాకారులు, కోచ్‌లతో కలిసి ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత క్రీడా రంగంలో ఆణిముత్యమైన హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ ప్రతిభతో తొలినాళ్లలో భారత క్రీడా రంగాన్ని అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చిన మహనీయుడన్నారు. ధ్యాన్ చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహించుకోవడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు క్రీడాకారులు, కోచెస్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వ్యక్తులకు, వాహనాలు నడిపే మైనర్లకు కూచిపూడి ఎస్సై డి. సందీప్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇదే విషయాన్ని మంగళవారం విలేకరులకు వెల్లడించారు. సిబ్బంది సహకారంతో వాహనాలు తనిఖీలు నిర్వహించినప్పుడు వెల్లడైన ఈ వివరాలను తెలియపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే మైనర్లను అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రులను పిలిపించి వారి సమక్షంలో డ్రైవింగ్ చేస్తున్న మైనర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇదే సమయంలో తల్లిదండ్రులకు కూడా హెచ్చరికలు నిర్వహించారు. కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలుజారీ చేశారు. వీటిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు పేర్కొంటూ తల్లిదండ్రులు దీనికి సహకరించాలని సూచించారు.

అక్రమ ఇసుక రవాణాపై ఫిర్యాదు

విశాలాంధ్ర-పమిడిముక్కల: మండల పరిధిలోని లంకపల్లి లో అక్రమ ఇసుక మాఫియా ని నియంత్రించే వరకు తెలుగు దేశం పార్టీ పోరాటం చేస్తుందని దీనిపై సత్యాగ్రహ ఉద్యమాలు చేపడతామని పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వర్ల కుమార రాజా హెచ్చరించారు.మంగళవారం అధిష్టానం పిలుపు మేరకు ఇసుక మాఫియా పై పమిడిముక్కల తహశీల్దార్ కి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఇసుక మట్టి ని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నా ఎమ్మెల్యే కైలే కనుసన్నల్లో వైకాపా నాయకులు చేస్తున్న ఇసుక దోపిడీ ఆపేవరకు తెదేపా పోరాటం సాగిస్తుంది, ప్రధమంగా తహశీల్దార్ డి. రాజ్యలక్ష్మి కి వైకాపా నాయకులు చేస్తున్న అరాచకాలు వినతిపత్రం లో పేర్కొన్నారు.లంకపల్లి లో గుత్తేదారు తవ్వుతున్న ఇసుక గుంతలు తో ఏప్రమాదాలు వస్తాయే నని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అక్కడ రైతులు తమ పొలాల్లో కంచె లని తొలగించి దారులు వేసుకుంటున్నారని అదేమిటంటే చంపుతామని బెదిరిస్తూన్నారని వాపోతున్నారు.అసలు అధికారులు ఇసుక మాఫియా పై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఫిర్యాదు లో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జక్కా శ్రీనివాస రావు లింగమనేని బాబు రావు కుమ్మరి రామారావు ఘంటా సురేష్ అలి తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు మూడు గంటలో ..

విశాలాంధ్ర-గన్నవరం : మిస్సింగ్ కేసును మూడు గంటల్లో గన్నవరం పోలీసులు ఛేదించారు. సీఐ కనకారావు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నవరంలోని బుద్దవరం రోడ్‌లో ఉండే మహ్మద్ షారుక్ 7వ తరగతి చదువుతున్న విద్యార్థి షారుక్ తప్పిపోయాడిని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు విద్యార్థి ఆచూకీ కనుగొని విద్యార్థిని తల్లికి అప్పగించారు.

'బంగారు రుణపథకం'కు విశేష స్పందన..

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని పెదపూడి యూనియన్ బ్యాంక్ (పూర్వపు ఆంధ్రా బ్యాంక్) లో నిర్వహిస్తున్న ప్రత్యేక బంగారు రుణ పథకంకు విశేష స్పందన పెరిగింది. సోమవారం ప్రారంభమైన ఈ పథకం బుధవారం వరకు కొనసాగుతుందని గోల్డ్‌అప్రైజర్ ఎం మధుసూదనరావు పేర్కొన్నారు. ఒక గ్రాము బంగారానికి రూ.4350 వడ్డీ నూటికి కేవలం 33 పైసలుకు రుణం అందజేస్తున్నామన్నారు. ఏ విధమైన భూమి పత్రాలు లేకుండా బంగారంపై రూ.2 లక్షల వరకు రుణం పొందవచ్చునన్నారు. ఆ బ్యాంకు అధికారులు ఏర్పాటు చేసిన లక్ష్యాన్ని అధిగమించడానికి మైక్ ద్వారా విస్తృత ప్రచారాన్ని బ్యాంకు మేనేజర్ శ్రావణి నిర్వహిస్తున్నారు. రుణాల కోసం వచ్చిన ఖాతాదారులతో బ్యాంకు సందడిగా మారింది.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర-గంపలగూడెం : తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గంపలగూడెం మండలంలోని సత్యాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎర్రమల. పిచ్చిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎంఆర్ .శేషంరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు గుర్రం. గోపాలరావు, ఇంజనీరింగ్ సహాయకులు జి. నాగమణి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

'గుప్పెడు మనసు' కథా సంపుటికి గిడుగు పురస్కారం

విశాలాంధ్ర-గుడివాడ : తెలుగు భాషా వికాస సమితి సమన్వయకర్త డిఆర్‌బి ప్రసాద్ ద్వారా ప్రముఖ రచయిత్రి యలమర్తి అనురాధకు "గుప్పెడు మనసు" కథా సంపుటికి గుడివాడ జిల్లా గ్రంథాలయంలో గిడుగు పురస్కారం అందజేశారు.

నాట్య కళా పీఠంలో తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర-కూచిపూడి : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళా పీఠంలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపీఠం ప్రాంగణంలో గల తెలుగుతల్లి విగ్రహానికి కళా పీఠం ప్రధానాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని భాషల్లో కెల్ల తెలుగు లెస్స అని చెప్పారు. మాతృభాష (తెలుగు)లో గల మాధుర్యం మరి ఇతర భాషలలోను కానరాదని, సమాజంలో మమ్మీ.. డాడీ, అంకుల్.. ఆంటీ సంస్కృతి పెరిగిందని వివరించారు. ఆంగ్ల భాష పై అవగాహన ఉండాల్సిన మాట వాస్తవమే కానీ అమ్మ ..నాన్న పిలుపులో గల ఆత్మీయత ఆనందం వాటిల్లో కనపడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాపీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ వేదంతో వెంకట దుర్గా భవాని, జూనియర్ అసిస్టెంట్ నల్లగుళ్ళ వెంకటేశ్వరరావు, గ్రంథాలయ అధికారి ఏలేశ్వరపు వెంకటేశ్వరఫణి కుమార్, సబర్నేట్.సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గిడుగు జయంతి

విశాలాంధ్ర-అవనిగడ్డ : వ్యవహారిక భాషా ఉద్యమం ద్వారా పుస్తకాల్లో వ్యవహారిక తెలుగు భాషను అందించిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని కొనియాడారు. స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో మంగళవారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు గ్రంథాలయ అధికారి ప్రభుదాసు నేతృత్వంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పుస్తక ప్రియులు గ్రంథాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర-అవనిగడ్డ : అవనిగడ్డలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అవనిగడ్డ సబ్‌జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు వంద అడుగుల భారీ జాతీయ పతాకాన్ని మైదానంలో ఆవిష్కరించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశానికి పేరు తెచ్చే క్రీడాకారులుగా ఎదగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ధ్యానచంద్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల ద్వారా దేశానికి పేరు ప్రతిష్టతలు తీసుకురావచ్చన్నారు. ఈ సందర్భంగా అవనిగడ్డ డిగ్రీ కళాశాల మైదానంలో ఐదు వేల మంది విద్యార్థులతో నిర్వహించిన మానవహారం విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం కళాశాల మైదానం నుంచి కోర్టు సెంటర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 500 అడుగుల భారీ జాతీయ పతాకాలు, విద్యానికేతన్, పులిగడ్డ ఏపీ రెసిడెన్సియల్కు చెందిన మరో భారీ జాతీయ పతాకాలతో విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్చార్జి కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంఈవోలు ఎస్ శివశంకరరావు, అన్నపరెడ్డి పిచ్చయ్య, శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్నాయుడు, అవనిగడ్డ సబోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శి కోసూరు పూర్ణచంద్రరావు, గరికపాటి మారుతి, కోశాధికారి మునగాల ఉదయ్, వ్యాయామ ఉపాధ్యాయులు మత్తి హరగోపాల్, జీఎస్వీ గోపాల్ తో పాటు అవనిగడ్డ నియోజకవర్గంతో పాటు పామర్రు నియోజకవర్గంలోని మొవ్వ మండలానికి చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగపూర్ ఇంటర్నేషనల్ మీడియేషన్ సెంటర్ అంతర్జాతీయ మధ్యవర్తి ప్యానెల్ సభ్యునిగా మాజీ సీజే ఎన్వీ రమణ

విశాలాంధ్ర-విజయవాడ : ప్రతిష్ఠాత్మక సింగపూర్ ఇంటర్నేషనల్ మీడియేషన్ సెంటర్ అంతర్జాతీయ మధ్యవర్తి ప్యానెల్ సభ్యునిగా భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ నియమితులయ్యారు. ఆయనకు సింగపూర్ ఇంటర్నేషనల్ మీడియేషన్ సెంటర్ చైర్మన్ జార్జ్ లిమ్ సింగపూర్‌లో మంగళవారం నియామక పత్రాన్ని అందించారు. సింగపూర్ న్యాయ మంత్రిత్వ శాఖ, 20కి పైగా భాగస్వామ్య సంస్థలు నిర్వహించే "సింగపూర్ కన్వెన్షన్ వీక్" వార్షిక సమావేశంలో పాల్గొనేందుకు ఆయన ప్రస్తుతం సింగపూర్‌లో ఉన్నారు. సింగపూర్ ఇంటర్నేషనల్ మీడియేషన్ సెంటర్ నాలుగు ప్రముఖ భారతీయ ఎంఎన్‌సీల ప్రతినిధులతో రమణ సమావేశమయ్యారు. ఆయన చొరవతో మధ్యవర్తిత్వానికి మద్దతు ఇవ్వడానికి నాలుగు భారతీయ కార్పొరేట్ సంస్థలు టాటా, రిలయన్స్, మహీంద్రా, ఆదిత్య బిర్లా గ్రూపులు 'డిక్లరేషన్ ఆఫ్ ఇంటెంట్'పై సంతకం చేయడానికి ముందుకు వచ్చాయి.

దోచుకోవటమే లక్ష్యంగా : బొండా ఉమా

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇసుక, మద్యం, మైనింగ్‌లలో అవినీతికి పాల్పడుతూ కోట్లాది రూపాయలు దోచుకోవటమే లక్ష్యంగా పని చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం గాంధీనగర్‌లోని ధర్నాచౌక్ వద్ద ఇసుక సత్యాగ్రహ దీక్ష టిడిపి రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.దీనికి ప్రధాన వ్యక్తగా విచ్చేసిన బోండా ఉమా మాట్లాడుతూ రాష్ట్రంలో టెండర్లు పిలవకుండా ఏజెన్సీలను ఏర్పాటు చేయకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు చేస్తున్న అక్రమ మైనింగ్, ఇసుక దందాలపై టిడిపి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిందన్నారు.జగన్మోహన్ రెడ్డి అవినీతిని ప్రజలలోకి తీసుకెళ్లటమే తమ ముఖ్య ఉద్దేశం అన్నారు.స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడ్డారు.మన రాష్ట్ర లో ఉన్న ఇసుక పక్క రాష్ట్రానికి పంపించి లారీకి రూ1,50,000 వసూలు చేస్తున్నారన్నారు.టిడిపి ప్రభుత్వం హయాంలో ఒక ట్రాక్టర్ 1,000 రూపాయలు అయితే ఇప్పుడు టాక్టర్ 5000 అయ్యింది,లారీ 3000 అయితే ఇప్పుడు 15,000 అయింది దీనికి జగన్ సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వచ్చాక కరంటు చార్జీలు పెంచారు. ట్రూ అప్ చార్జీలని ప్రజల దగ్గర వసూలు చేస్తున్నారు. సెప్టెంబర్ 1 నుండి టీడీపీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రతి ఇంటికి బాబు షూరిటీ భవిషత్ గ్యారంటీ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నాము అన్నారు. మాజీ కార్పొరేటర్ ఎర్రబోతు రమణ మాట్లాడుతూ ఎమ్మెల్యే వెల్లంపల్లి స్థాయిని మరిచి మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబును, లోకేష్‌ను విమర్శించే స్థాయి అతనికి లేదు రాబోయే ఎన్నికల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ ధర్నాలో టిడిపి నాయకులు గొట్టిముక్కల రఘురామరాజు,లుక్క సాయిరాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ట్రస్టీగా సుదర్శన్ వేణు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటిడి)కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన 24 మంది ట్రస్టీలలో టీవిఎస్ మోటర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్ వేణు ఒకరు. సాధారణంగా ఈ ట్రస్టీల పదవీకాలం రెండేళ్లు ఉంటుంది. ఆలయ కార్యకలాపాలను పర్యవేక్షించే అంతిమ అధికారం ఈ బోర్డుకు ఉంటుంది. తన మహోన్నత, వైవిధ్యభరితమైన అవగాహనతో ఆలయ పనితీరుకు సుదర్శన్ ఉన్నతంగా తోడ్పడగలరు.

గండి మైసమ్మలో రూ. 2200 కోట్లతో అపర్ణ సినర్జీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దక్షిణ భారతదేశంలో అతిపెద్ద రియల్ ఎస్టేట్ డెవలపర్‌లలో ఒకటి కావటంతో పాటుగా ఏకైక బ్యాక్ వార్డ్ ఇంటిగ్రేటెడ్ డెవలపర్, అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అపర్ణ సినర్జీని ప్రారంభించినట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లోని గండి మైసమ్మ వద్ద నిర్మించనున్న హైఎండ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ సముదాయం ఇది. ఈ గేటెడ్ కమ్యూనిటీ 28.5 ఎకరాల స్థలంలో విస్తరించి ఉంది. 1251 చదరపు అడుగులు నుండి 2307 చదరపు అడుగులు వరకు విస్తీర్ణం కలిగిన 2, 2.5, 3 బీహెచ్కే లేఅవుట్‌లతో 3345 అపార్ట్‌మెంట్‌లను కలిగి ఉంది. ఈ ప్రకటనతో, అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ తమ కార్యకలాపాలు ప్రారంభించిన నాటి నుండి 65 రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లను విజయవంతంగా ప్రారంభించిందని అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ డైరెక్టర్ రాకేష్ రెడ్డి వెల్లడించారు.

'మెన్ ఆఫ్ ప్లాటినం' సరికొత్త ప్రచారంలో క్రికెటర్ సూర్యకుమార్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్ (పీజీఐ) ఇండియాస్ 'మెన్ ఆఫ్ ప్లాటినం' కొత్త అధ్యాయాన్ని పరిచయం చేసింది. ఈ బ్రాండ్ ప్రముఖ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ ను నూతన ప్రచారానికి ఎన్నుకుంది. ప్లాటినం అంటే శాశ్వతమైన అరుదైన లక్షణాలకు అద్దం పడుతుంది. ఆరు ఆకర్షణీయమైన డిజిటల్ ఫిల్మ్ లు, టెలివిజన్ రెండిషన్, ప్రింట్ ఇతర కంటెంట్ ఫార్మాట్లో సూర్యకుమార్ ప్రయాణాన్ని వివరిస్తాయి. 'ఏ మినిట్ విత్ మెన్ ఆఫ్ ప్లాటినమ్ - సూర్యకుమార్ యాదవ్' అనే సిరీస్ ద్వారా ఆయన జీవితంలో మైలురాళ్ల అందరికి సుపరిచితమయ్యాయి.

CHANGE OF NAME

I, **PARVATHI (Old Name)**, W/o. SURESH KUMAR resident of D. No. 13-7-812/3, Flat No. 404, Danayanthi Residency, Tadigadapa 100 feet road, Kanuru, Vijayawada (Rural), Krishna Dt. Andhra Pradesh - 520007. I have changed my name as **SUNKARA PARVATHAMMA (New Name)**, W/o. SUNKARA SURESH KUMAR. Hereafter, my name is known as **SUNKARA PARVATHAMMA (New Name)**, W/o. SUNKARA SURESH KUMAR.

భాషోద్యమ కారుడు గిడుగు రామ్మూర్తి : కొమ్మారెడ్డి

విశాలాంధ్ర-బంటుమిల్లి : వ్యవహారిక భాష అనగానే మన మదిలో మెదిలేది తెలుగు భాషోద్యమకారుడు గిడుగు రాంమూర్తి అని స్థానిక కొమ్మారెడ్డి పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ అన్నారు .తెలుగు భాషోద్యమకారుడు గిడుగు రామ్మూర్తి 160 వ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ నందు పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ సారధ్యంలో తెలుగుభాష దినోత్సవవేడుకలూ విద్యార్థుల తెలుగుకవుల వేషధారణలతో అంగరంగవైభోవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ తెలుగుభాష గురించి విద్యార్థులకు వివరిస్తూ నాలుగు దశాబ్దాలకు పైగా వ్యవహారిక భాషోద్యమం కోసం గిడుగు అలుపెరుగని పోరాటం చేశారన్నారు. 1 వ తరగతి నుండి 10 వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన తెలుగు వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎన్ శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వానపాములలో 'మహిళా మహాశక్తి'

విశాలాంధ్ర-పెదపారుపూడి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 5 కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తూ తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టోను మహిళా మహాశక్తి ద్వారా మహిళలకు వివరించడానికి మండలంలోని వానపాముల గ్రామంలో నియోజకవర్గ మహిళా కమిటీ ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టో ను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైనేని ఇందిర మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన స్త్రీకి ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500లు తల్లికి వందనం పథకం కింద మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా మహిళలందరికీ టికెట్ లేని ప్రయాణం, బీసీలకు రక్షణ చట్టం తెచ్చి వారికి అన్ని విధాల అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాతూరి బసవయ్య, జుజ్జువరపు బాజీ, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై ఉద్యమాలకు
ప్రజలను సమాయత్తం చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-మైలవరం: గ్రామాల స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నింటినీ సర్వేల ద్వారా అధ్యయనం చేసి ఆ సమస్యల పరిష్కారానికి ఉద్యమాల నిర్వహణకు ప్రజలను సమాయత్తం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు సూచించారు. మైలవరం మండలంలోని పోరాటనగర్‌లో సోమవారం జరిగిన పార్టీ, ప్రజా సంఘాల ముఖ్య కార్యకర్తలు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామ స్థాయిలో ప్రజలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని ముఖ్యంగా నివేశ స్థలాలు, ఇళ్ళ నిర్మాణం, జగనన్న ఇళ్లకు నిధులు కొరత, రహదారులు, డ్రైనేజీ, విద్య, వైద్యం, మరుగుదొడ్ల నిర్మాణం, రైతులకు వ్యవసాయ తరుణంలో ఋణ సౌకర్యం, ఉపాధిహామీ కూలీలకు కూలి రేట్లు పెంపుదల, పేదల సాగులో ఉన్న భూములకు పట్టా, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా తాగటానికి కృష్ణా నీరు సరఫరా తదితర మౌలిక సమస్యలు పరిష్కారం కాకపోవటంతో ఇబ్బందులుపడుతున్నారని వివరించారు. సీపీఐ ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి, ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని సమస్యలపై వారికి అవగాహన కల్పించి ప్రజా ఉద్యమాలకు సమాయత్తం చేయాలన్నారు. దేశాన్ని కాపాడండి-రాష్ట్రాన్ని రక్షించండి అనే లక్ష్యంతో ప్రజలలో చైతన్యం కల్గించేందుకు సీపీఐ రాష్ట్ర సమితి నిర్ణయం మేరకు రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ సారథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సుయాత్ర ఈ నెల 24వ తేదీన ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెంలో మధ్యాహ్నం బహిరంగ సభతో ప్రారంభమై రాత్రి విజయవాడలో బహిరంగ సభతో ముగించే వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టుదలతో కృషి చేసి జయప్రదం చేసినందుకు జిల్లా పార్టీ యంత్రాంగం మొత్తానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగోతు నాగు, బాణావత్ శివుడు నాయక్, అజ్మీరా అయ్యా, భూక్య చినతావ్, యమ్ గురవయ్య, భూక్యా మోటో, ఆనంద బాబు, కృష్ణా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

సంఘటిత శక్తితోనే భద్రత సంక్షేమం

విశాలాంధ్ర-విజయవాడ : ఒక వ్యవస్థలోని వ్యక్తులు సంఘటితం కావటం ద్వారా వారికి భద్రత, సంక్షేమం లభిస్తుందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. ఏఐటీయూసీ అనుబంధంగా 'జై భారత్ ఆర్క్, గ్యాస్ వెల్డింగ్ షాపుల ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్' చేరుతున్న సందర్భంగా జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జీఎస్ రాజు రోడ్డులోని నగర పాలక సంస్థకు చెందిన దమ్మాలపాటి రామారావు కాంప్లెక్స్ మంగళవారం అసోసియేషన్ అధ్యక్షుడు కోనేరు ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ షాపుల యాజమానులకు లాభాలు వచ్చేలా కార్మికులు పనిచేస్తే లాభాలకు కారణమైన కార్మికుల సంక్షేమాన్ని యజమానుల బాధ్యత ఉందని తెలియజెప్పుతూ ఏఐటీయూసీ పని చేస్తుందన్నారు. సంఘటితం కాకుండా ఒక్కరుగా ఉంటే బాడా వ్యక్తులు వ్యాపారాన్ని దెబ్బతీసే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా వర్తించాలంటే అసోసియేషన్‌గా ఉంటేనే సాధ్యం అవుతుందని చెప్పారు. ఓట్లు కోసం ధనం ఆశగా చూపి నాయకులుగా ఎదిగే రాజకీయాలకు దూరంగా ఉంటూ కార్మికుల హక్కులను సాధించుకోవాలన్నారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి మూలి సాంబశివరావు మాట్లాడుతూ అసోసియేషన్ ఏఐటీయూసీలో చేరటం, నిర్మాణం, కార్మికుల బాధ్యతలను వివరించారు. కార్మికుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కొట్టు రమణరావు, మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్ కార్యవర్గం: అధ్యక్షులు కోనేరు ఈశ్వరాచారి, ఉపాధ్యక్షులు అనుపోజు తాతాచార్యులు, కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి షేక్.ఉస్మాన్, కోశాధికారి ఆర్‌టీడీ గోవింద బ్రాహ్మనందాచార్యులు ఉన్నారు.

ప్రజల ప్రాణాలంటే ఇంత నిర్లక్ష్యమా..?

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలంటే ఇంత నిర్లక్ష్యమా అనే స్థితి చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ చూస్తే అర్థమవుతోందని సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వర రావు విమర్శించారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో గోతులమయమైన చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ పై రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ప్రమాదాలను నివారించాలని కోరుతూ.. మంగళవారం మిల్క్ ప్రాజెక్ట్, చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ రోడ్డుపై (నల్ల జెండాలతో రెండో దపా) నిరసన తెలుపుతూ ఇరువైపులా వచ్చే వాహనదారులతో సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కోటేశ్వరావు మాట్లాడుతూ సివిఆర్ ఫ్లైఓవర్ పై రోడ్లు వేసి, ప్రమాదాలను నివారించాలని కోరుతూ, గత రెండు నెలలుగా 4 సార్లు ధర్నాలు చేసి, ఆర్ అండ్ బి అధికారీ డిప్యూటీ సూపరింటెంట్ వెంకన్న దొరకు, స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావుకు వినతి పత్రాలు సమర్పించినా, ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడం దున్నపోతు మీద వర్షం పడిన చందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో రోడ్లకు కేటాయించిన 3,432 కోట్ల రూపాయలు నిధులు ఏమైనట్టు అని ప్రశ్నించారు.

ఇటీవల ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే కమ్యూనిస్టులు విమర్శిస్తున్నారని ఆరోపణలు చేయటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గమనిస్తే, నగర ప్రారంభంలోనే ఉన్న చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ పైన రోడ్డు యొక్క గుంతలు చూస్తే ప్రభుత్వ పనితీరుకి నిదర్శనమన్నారు. ఇప్పటికే నాలుగు దఫాలుగా ఈ సమస్యపై నిరసనలు చేసినా.. పట్టించుకోని నగర మేయర్ ప్రతిపక్ష పార్టీల జెండాలను తెల్లవారుజామునే తీయించి వేయటం సబబు కాదని, రోడ్లు, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. కమ్యూనిస్టులు చూస్తూ ఊరుకోరని, వైసిపి ప్రభుత్వం చేతకానితనాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి, ప్రజా ప్రయోజనాల కోసం, నగర అభివృద్ధి కోసం, ఉద్యమానికి సన్నద్ధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, కార్యవర్గ సభ్యులు డివి రమణబాబు, కొట్టు రమణారావు, స్థానిక నాయకులు కుర్రా శివకుమార్, ఎస్.కె నజీర్, ఆర్ మైకేల్, గాడి రాము, పగిడి కత్తుల రాము, దాసిన నారాయణరావు, దాసరి రంగారావు, కే వెంకటేశ్వరరావు, పిట్ట అప్పారావు, ఆర్ గురునాథం, కాగితాల కనకారావు, టీ ధనుంజ కుమార్, దుర్గారావు, వాసు, ఎస్ డి అకిం, ఈ అజయ్, టి వెంకటేశ్వరరావు, కే భార్గవ, లంకే సాయి కుమార్, పి విజయ్, ఎస్ మోహన్, కొట్టు శివకృష్ణ, చింతాడ పార్వతి, దుర్గాసి రమణమ్మ, బంకా ఝాన్సీ లక్ష్మి, పడాల తవుడమ్మ, అప్పయమ్మ, గుణ సుందరి, కొట్టు దుర్గ, యువజన, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు హక్కు పత్రాల మంజూరుకు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర- విజయవాడ (కృష్ణలంక) : అటవీ హక్కుల చట్ట నిబంధనలను పరిశీలించి భూ హక్కు పత్రాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు అధికారులను ఆదేశించారు. రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట గ్రామానికి చెందిన 8మంది గిరిజనులు అటవీ భూమి హక్కులకు మంగళవారం అటవీ హక్కుల జిల్లా స్థాయి కమిటీ చైర్మన్, కలెక్టర్ ఢిల్లీరావు అప్పీలు చేసుకున్నారు. దీనిపై స్థానిక కలెక్టర్ కార్యాలయం నుండి కలెక్టర్ రెవెన్యూ, గిరిజన సంక్షేమ, అటవీ శాఖ అధికారులతో గూగుల్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట గ్రామానికి చెందిన గిరిజనులు గత కొన్నేళ్ళుగా అటవీ భూములను సాగు చేసుకుంటున్నామని ఆ భూములకు భూ హక్కు పత్రాల మంజూరు చేయాలని అప్పీల్ చేసుకోవడం జరిగిందన్నారు. ఈ గూగుల్‌కాన్ఫరెన్స్‌లో జేసీ డా.పీ.సంపత్‌కుమార్, గిరిజన సంక్షేమాధికారి ఎం.రుక్మాంగదయ్య, జిల్లా అటవీ శాఖాధికారి ఏవీఎస్‌ఆర్‌కే. అప్పన్న పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

విశాలాంధ్ర-కంచికచర్ల: నందిగామ నియోజకవర్గ ఈఆర్ఓ, నందిగామ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఏ. రవీంద్ర రావు మంగళవారం కంచికచర్ల మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో పోలింగ్ స్టేషన్ నెం.212, 213, 216, కంచికచర్ల గ్రామంలో పోలింగ్ స్టేషన్ నెం 193, కీసర గ్రామంలో పోలింగ్ స్టేషన్ నెం 170, 171, 172 ల లో మరణ ఓటర్ల తొలింగిపుకు సంబంధించి ఫార్మ్ ను వెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబసభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల ఏ ఈ ఆర్ ఓ, తహసీల్దార్ శంకర్ బాబు, డి టి నాగుల మీరా, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యాలయాల తనిఖీ

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలోని పలు ప్రభుత్వ పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ మంగళవారం తనిఖీ చేశారు. ఆయా విద్యాలయాల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వినియోగంపై ఈ సందర్భంగా విచారించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లభిస్తున్న సదుపాయాల కల్పన, విద్యాబోధనపై నేరుగా వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

పంటపొలాల పరిశీలన

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలంలో పంట పొలాలను మంగళవారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా నరసాపురం గ్రామంలో మండల వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, వరి పైరుపై అగ్గితెగులు, పొడతెగులు, కాండం కుళ్లు తెగులు తదితరాల దాడి ఉందని, వీటిని సమగ్ర యాజమాన్య విధానాల ద్వారా అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లవించిన ఆకాశవాణి శ్రావణ సంగీత సంధ్యారాగం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ప్రసార భారతి ఆధ్వర్యంలో ఆకాశవాణి విజయవాడ కేంద్రం జి 20 సందర్భంగా రెండు రోజులపాటు సిద్ధార్థ ఆడిటోరియంలో సంగీత సంధ్య పేరిట నిర్వహిస్తున్న జానపద కళారూపం,లలిత, శాస్త్రీయ సంగీత కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సిహెచ్ ఎల్ తులసి విశ్వనాథ్ కర్ణాట గాత్ర సంగీత కచేరితో కార్యక్రమం ప్రారంభమైంది. తన గానాన్ని చంద్రప్రియ రాగంలో బాలమురళీకృష్ణ వర్ణంతో ప్రారంభించి వరుసగా నళిని కాంతిలో నీ పాదమే గతి,సరసాంగిలో నీకేల దయ రాదు,రీతిగౌళలో రాగరత్నమాలికచే వంటి ఇత్యాది కీర్తనలతో హృద్యంగా పాడి వినిపించారు. వీరికి వయోలిన్‌తో వి కృష్ణవేణి, మృదంగంతో దండమూడి సుమతి రామమోహనరావు, ఘటంతో ఎస్ హనుమంతరావులు సహకరించారు. వీరికి వయోలిన్ తో కె ఎస్ రాజు, కీ బోర్డు తో జె రాజు,తబలాతో ఇజ్రాయల్,డోలక్ తో చిట్టిబాబు తదితరులు సహకరించారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రం అధికార బృందం పర్యవేక్షించారు. ప్రఖ్యాత సంగీత విద్వాంసులు అన్నవరపు రామస్వామి,దండమూడి సుమతీ రామమోహనరావు తదితర ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రం అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

జడ్పీహెచ్ పాఠశాలల లైబ్రరీకి పుస్తకాల బహుకరణ

విశాలాంధ్ర-వీరులపాడు : నేటి విద్యార్థులకు మంచి ప్రవర్తనతో నడవాలని హైదరాబాదుకు చెందిన బాలచంద్ర 'కంపాస్' అనే పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని జుజ్జూరు వాసి ప్రస్తుతం కర్నూలులో నివాసముంటున్న తుమ్మేపల్లి శ్రీనివాసరావు 100 పుస్తకాలను కొనుగోలు చేసి తన మిత్రుడు దేవరకొండ శ్రీనివాసరావు చే వీరులపాడు మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల లైబ్రరీలకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ దేవరకొండ శ్రీనివాసరావు, వీరులపాడు ఎంపీటీసీ ప్రకాష్ రావు, జయంతి ఎంపీటీసీ సత్యనారాయణ రెడ్డి, విశాలాంధ్ర విలేఖరి అమరా ఉదయ భాస్కరరావు, ఎస్ కే బాజీ, మాబు మాస్టారు, బొంతల పుల్లారావు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చట్టాలు, విధులపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ప్రజలకు పారదర్శకమైన జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించడంలో పంచాయతీ కార్యదర్శులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలు, విధులపై అవగాహన ఉండటంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు భూమిపై యాజమాన్య హక్కులను అందించడానికి ప్రవేశపెట్టిన స్వామిత్వ సర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ఏపీ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీ రాజ్ శాఖ, జిల్లా పంచాయతి అధికారి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గుణదల్లోని సోషల్ సర్వీస్ సెంటర్‌లో పంచాయతీ కార్యదర్శులకు 3వారాల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి ప్రజలకు సమర్థవంతమైన సేవలతో పాటు గ్రామాలను అభివృద్ధి చేసినప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి సాధించగలుగుతాయనే ఉద్దేశంతో ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్ఐఆర్‌డీ జేడీ వరప్రసాద్, విజయవాడ రూరల్ ఎంపీడీవో శేషగిరి, డీఎల్‌పీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలుగు భాష ఔనత్యాన్ని భావితరాలకు చాటి చెప్పాలి

తెలుగు భాష ఔనత్యాన్ని భావితరాలకు చాటి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. తెలుగు అధికార భాషా సంఘం, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని మంగళవారం కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాషను ఆధునిక పద్ధతిలో ఆలోచించిన భాషా విజ్ఞాని గిడుగు రామమూర్తి పంతులు జన్మదినమైన ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఈ ర్యాలీలో జేసీ డాక్టర్ సంపత్‌కుమార్, డీఆర్‌వో మోహన్‌కుమార్, డీఇవో రేణుక, పాఠశాల తనిఖీ అధికారి రవికుమార్, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యూబీఐ ఆధ్వర్యంలో 'యు జీనియస్' క్విజ్ పోటీలు

విశాలాంధ్ర-విజయవాడ: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేషనల్ జనరల్ అవేర్‌నెస్ క్విజ్ కాంపిటీషన్ 'యు జీనియస్' పేరుతో నిర్వహించారు. పంటకాలవ రోడ్డులోని స్టెల్లా మారిస్ ఇండోర్‌స్టేడియంలో జరిగిన ఈ పోటీలలో 450 పాఠశాలల నుంచి 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో విజేతలుగా నిలిచిన వారిని ముంబైలోని యూబీఐసెంట్రల్ ఆఫీసులో నిర్వహించే ఫైనల్ రౌండ్‌కు పంపటం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐడీ అడిషనల్ ఎస్పీ కేవీజీ సరిత ముందుగా విద్యార్థులను ఉద్దేశించి సందేశాత్మక ప్రసంగం చేశారు. విద్య, జీవితంలో విద్య ప్రాముఖ్యత, సోషల్ మీడియా, ఇంటర్నెట్‌నుఉపయోగించుకునే సురక్షితమైన మార్గాలు, పిల్లల రక్షణ, సమాజంపై అవగాహన తదితర అంశాలపై ప్రేరణాత్మకంగా బోధించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ జోనల్ మేనేజర్ నవనీత్‌కుమార్, డిప్యూటీ జోనల్ హెడ్స్ ఎ.శారద మూర్తి, పీవీజేఎస్.మూర్తి, మురళి పార్థసారథి, రీజినల్ హెడ్ ఎం.శ్రీధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ పదవికి 9న ఎన్నికలు

-1 నుంచి 5 వరకు నామినేషన్ల స్వీకరణ...9న ఫలితాలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డులో ముతవల్లి కోటా డైరెక్టరు పదవులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. సెప్టెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 5వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు నామినేషన్ పత్రాలను పరిశీలిస్తారు. 7వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ఎన్నికల అధికారి ప్రకటిస్తారు. సెప్టెంబరు 9వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విజయవాడ వన్‌టౌన్ పంజా సెంటర్‌లోని ముసాఫిర్ ఖానాలో పోలింగ్ నిర్వహిస్తారు. అనంతరం ఓట్ల లెక్కింపు నిర్వహించి... విజేతలను ప్రకటిస్తారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఇప్పటికే అర్హత కలిగిన ముతవల్లిలతో వక్ఫ్ బోర్డు అధికారులు ఓట్ల జాబితాను సిద్ధం చేశారు.

CHANGE OF NAME

I, ELURI BRAHMAIAH (old name) S/o. Venkata Reddy Resident of D.No.20-4-191B, Ayodhya Nagar, Donka Road, Vijayawada-520 003, N.T.R District, Andhra Pradesh., have Changed my name as VELURI BRAHMA REDDY (new name) S/o. VELURI VENKATA REDDY. Hereafter my name is known as VELURI BRAHMA REDDY (New Name) with immediate effect.

మహారాజశ్రీ విజయవాడ 12వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జివారి కోర్టులో

O.S.74/2019

Between:
Bonu Durga Naresh - **Plaintiff**
and
1) Gogineni Harish
2) Pallerlamudi Rani - Defendants
To
Pallerlamudi Rani, W/o. Gogineni Prasad, Plot No. D4, 3rd Floor, 48-13-3B & 3C, Sri Rama Residency, Sri Ramachandra Nagar, Currency Nagar, Beside Ayush Hospital, Vijayawada.
- Defendant No.2

పై నంబరు దావాలో 2వ డెఫెండెంట్ అయిన మీకు శ్రీకోర్టువారు ఎన్ని సమన్లు పంపినను, తీసుకొనక కాలయాపన చేస్తున్నందున, ఈ నోటీసు ద్వారా మీయొక్క హాజరు నిమిత్తం శ్రీకోర్టువారు **15-9-2023**నకు వాయిదా వేసియున్నారు. కావున **ది. 15-9-2023న ఉదయం గం. 10.30ని.లకు** పై కోర్టువారి ఎదుట స్వయముగా గానీ, న్యాయవాది ద్వారాగానీ హాజరై, ఆక్షేపణలున్న యెడల తెలుపవలెను. లేనియెడల దావా మీ వరోక్షమున తీర్మానింపబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

బి. సూర్యప్రకాశరావు
వాది తరఫు న్యాయవాది, సెల్: 9849695243

ప్రకటన

నా క్లయింటు జాగర్లమూడి సీత కళ్యాణి, తల్లి. గుంటక రామాంజునమ్మ గారి ఆస్తి విజయవాడ వారి తరఫున లీగల్ ప్రకటన. నా క్లయింట్ అయిన జాగర్లమూడి సీత కళ్యాని వారి తల్లి గుంటక రామాంజునమ్మ గారి ఆస్తి రామాంజునమ్మ గారి మరణానంతరము స్వయంగా అనుభవిస్తున్న ఆస్తి తాలూకా ఒరిజనల్ డాక్యుమెంట్ నెం.622/1988 బండిలో పెట్టుకొని పాయకాపురం రోడ్డులో ది.13-08-2023న వెళ్తుండగా డాక్యుమెంట్స్ కనిపించడం లేదు. నేను ఎంత వెదికిన దొరక లేదు. డాక్యుమెంట్స్‌తో కూడిన ఆ బ్యాగు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సు గాని, ఫోన్ నెంబరు గానీ తెలియపర్చగలరు. **షెడ్యూలు:** కృష్ణాజిల్లా, (ఎన్‌టీఆర్ జిల్లా), జగ్గయ్యపేట మండలం, జగ్గయ్యపేట మునిసిపాలిటీ చెరువు బజారులోని సర్వే నెం.500/1ఏ1, డి.నెం.2-48/2 గల ఇంటి చ.గ.58 1/2 లేక చ.మీ.49.54లు స్థలం **హద్దులు: తూర్పు:** తాళ్ళూరి పిచ్చమ్మ, **దక్షిణం:** సందు దారి, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** తాతి అంజమ్మ.

ఆర్. ప్రేమ్‌రాజ్, అడ్వకేట్
డోర్ నెం.53-1-53/సి, విజయనగర్ కాలనీ, విజయవాడ-520008,సెల్: 9182245520

ప్రకటన

నా క్లయింటు యర్రంశెట్టి కృష్ణ చైతన్య, తండ్రి. నాగభూషణం గారి ఆస్తి మంగళగిరి వారి తరఫున లీగల్ ప్రకటన. నా క్లయింటు అయిన యర్రంశెట్టి కృష్ణ చైతన్య గారి ఆస్తి తాలూకా లింక్ ఒరిజనల్ డాక్యుమెంట్ నెం.1181/1977 బండిలో పెట్టుకొని అజిత్‌సింగ్ నగర్ రోడ్డులో ది.13-08-2023న వెళ్తుండగా డాక్యుమెంట్స్ కనిపించడం లేదు. నేను ఎంత వెదికిన దొరకలేదు. డాక్యుమెంట్స్‌తో కూడిన ఆ బ్యాగు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు గానీ, ఫోన్ నెంబరుకు గానీ తెలియ పర్చగలరు. **షెడ్యూలు:** గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, నవులూరు శివారు యర్రబాలెం గ్రామం, తాలూకు డి.నెం. 784-బి, డోర్ నెం.11-4/4, ప్లాట్ నెం.17, బాపతు చ.గ. 145 లేక చ.మీ. 121.94ర్లు కి **హద్దులు: తూర్పు:** జీరో హద్దు, **దక్షిణం:** దానబోయిన యల్లమంద రావు, **పడమర:** గాలంకి సునీత, **తిరిగి దక్షిణం:** గాలంకి సునీత, **తిరిగి పడమర:** షేక్ మౌలాలి, **తిరిగి దక్షిణం:** షేక్ మౌలాలి, **ఉత్తరం:** రోడ్డు.

ఆర్. ప్రేమ్‌రాజ్, అడ్వకేట్
డోర్ నెం.53-1-53/సి, విజయనగర్ కాలనీ, విజయవాడ-520008,సెల్: 9182245520

ప్రకటన

నా క్లయింట్సు అయిన ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ కాపురస్తులు పొత్తూరు వేణుగోపాలరావు గారి కుమారులు **1) పొత్తూరు జితేంద్ర కుమార్, 2) పొత్తూరు వంశీకృష్ణగార్ల** సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

నా క్లయింట్లు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని **బంకా వెంకయ్యగారి** కుమారుడు **బంకా వెంకట నాగరాజు** గారి నుండి క్రయం పొందుటకు అంగీకరించి విక్రయ అగ్రిమెంట్ పొంది త్వరలో సక్రమమైన రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు ద్వారా షెడ్యూలాస్తిని నా క్లయింట్సు పొత్తూరు **జితేంద్రకుమార్** మరియు **పొత్తూరు వంశీకృష్ణగార్లు** స్వాధీనం పొందబోవుచున్నారు. కాబట్టి షెడ్యూలాస్తిపై ఎవరికైనను ఎటువంటి హక్కులు గాని క్లయిములు గాని, భాగలబ్ధి తగాయిదాలు గాని ఉన్నయెడల ఈ ప్రకటన తేదీనుండి వారం దినములలోపు వ్రాత పూర్వకముగా రిజిష్టర్డు పోస్టు ద్వారా అభ్యంతరములు తెలియజేయగలరు, లేనిచో తదుపరి వచ్చు అభ్యంతరములు చట్టరీత్యా చెల్లజాలవు.

షెడ్యూలు : ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ సబ్ రిజిష్టారు వారి యిలాకా విజయవాడ మున్సిపల్ కార్పోరేషను ఏరియాలో చేరిన సర్వే నెం. 160 మున్సిపల్ వార్డు నెం.20, ప్రస్తుత **న్యూ అసెస్మెంట్ నెం. 107309 4586** ఏలూరు రోడ్డు, సీతారాంపురం, వాపరాల వారి వీధి నందు డోరు నెం.30-19-36/1, దాఖల చ.గ.170లు, చ.మీ. 142-14ల విస్తీర్ణంగల స్థలంలో స్టిల్టు ఫ్లోరు, గ్రౌండ్ ఫ్లోరు, ఫస్ట్ ఫ్లోరు, సెకండు ఫ్లోరు ఆర్.సి.సి. దాబా కట్టడముల ఆస్తి హద్దులు : **తూర్పు :** మల్లవోలు అనసూయమ్మ గారి ఆస్తి **దక్షిణం :** బత్తుల రాజయ్యగారి ఆస్తి **పడమర :** మున్సిపల్ రోడ్డు **ఉత్తరం :** శివకోట నాగేశ్వరాంబగారి ఆస్తి.

ఎ.సరస్వతి, న్యాయవాది
డో.నెం.11-45-76 శేషయ్య వీధి,
విజయవాడ, 30-8-23 విజయవాడ-1

తెలుగు సంస్కృతిని చాటిన చిన్నారులు

విశాలాంధ్ర-విజయవాడ : తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను పురస్కరించుకుని వీరమాచనేని పెద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు తెలుగు సంస్కృతిని చాటిచెప్పారు. గిడుగు రామూర్తి ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు అయినా గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ప్రార్థనా సమావేశంలో విద్యార్థులు ప్రాచీన ఆధునిక కవుల వేషధారణలో ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సంచాలకులు మేడా సీతారామయ్య, ఉపసంచాలకులు రోజ్ మేరీ, ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ జయలక్ష్మి పాల్గొని తెలుగు భాష ఔన్నత్యాన్ని, ధ్యాన్ చంద్ క్రీడాకారుడే కాకుండా గొప్ప దేశభక్తుడని కలవాడని తెలియజేసే అంశాలను వివరించారు.

రన్నింగ్ కారులో మంటలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ నుండి హైదరాబాద్ వెళ్తున్న రన్నింగ్ కారులో మంటలు చెలరేగాయి. కీలేశపురం వద్ద ఆల్టో కారులో నుంచి ఉన్నట్టుండి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ కారును పక్కకు ఆపి వెంటనే కిందకు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు మంటల్లో దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు చెలరేగాయని పోలీసులు భావిస్తున్నారు.

చేపలచెరువుల హక్కులపై సమగ్ర విచారణకు డిమాండ్

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: చెరువుల్లో చేపల పెంపకం హక్కులపై పంచాయతీ నిర్వహిస్తున్న వేలంపాటలపై సమగ్ర విచారణ చేపట్టాలని రాజకీయపార్టీల నేతలు డిమాండ్ చేశారు. చేపలచెరువుల వివాదంపై మంగళవారం 'విశాలాంధ్ర' పత్రికలో వచ్చిన కథనంపై పలు ప్రతిపక్ష పార్టీలు స్పందించాయి. విస్సన్నపేటలో ఈ విషయమై సమగ్ర దర్యాప్తు చేపట్టాలంటూ ప్రత్యేక పాత్రికేయుల సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విస్సన్నపేట పంచాయతీలో మొత్తం ఆరు చెరువులు ఉండగా, వీటిలో ఒక చెరువు పూర్తి హక్కులను రజక వృత్తిదారులకు కేటాయించాల్సి ఉందన్నారు. మిగిలిన చెరువుల్లో చేపల పెంపకం విషయంలో వేలంపాట నిర్వహించాల్సి ఉండగా, గత కొన్ని సంవత్సరాలుగా వేలం నిర్వహించకుండా, పాలకులు ఇష్టానుసారం అక్రమార్జన చేస్తున్నారని ఆరోపించారు. ప్రధానంగా గ్రామంలోని అనంతమ్మకుంట చెరువుకు సంబంధించిన ఆదాయం ఎక్కడికి వెళుతుందని ప్రశ్నించారు. పంచాయతీ పాలకవర్గం ఇష్టానుసారం చేస్తున్న దోపిడీపై ఉన్నతాధికారులు స్పందించి, విచారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకుడు డి.హరినాథ్, టీడీపీ నాయకులు ఆకుల రాధాకృష్ణ, అనసాని లాలయ్య, జనసేన నాయకుడు నందమూరి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకుడు గుత్తా శివసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియా ఆగడాలు అరికట్టాలి

విశాలాంధ్ర-కంచికచర్ల: నిబంధనలు ఉల్లంఘించి కాల్ చేస్తూ పర్యావరణ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని భూగర్భ జలాలపై ఈ ప్రభావం పడి భూజలాలు తగ్గిపోతుండడంతో సాగు, త్రాగు ఇంటికి సమస్య ఏర్పడే ప్రమాదం ఉన్నదని అందుకని ఇసుక మాఫియా పై తక్షణమే చర్యలు చేపట్టాలని తెలుగుదేశం ప్రతినిధి బృందం డిమాండ్ చేసి ఈ మేరకు వారం మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్లో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పేరిట వాగులు వంకల నుంచి ఇసుకను తవ్వేస్తున్నారని రీచులలో త్రవ్వకాలు మొదలుకొని స్టాక్ పాయింట్లకు తరలించి విక్రయాలు, కోపం వంటి వాటితో పెద్ద ఎత్తురా అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అనుమతులు లేకున్నా ఇసుక అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారని భారీ యంత్రాలను నదిలోకి దింపి దాన్ని తొలి చేస్తున్నారని వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు ఏ ఎలాంటి చరిత్ర తీసుకోవడం లేదన్నారు. అనుమతించిన సరిహద్దులను చెరిపేసి నదిలోకి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలు కోవాలని ఇసుక మాఫియా పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడపనేని లక్ష్మీనారాయణ, వేమా వెంకట్రావు, బుద్ధి సూర్యప్రకాష్, నంబూరు దుర్గారావు, బాణావతి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాష దినోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భాష ఉద్యమం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతులు అని బీఆర్‌టీఎస్ వాకర్స్ గవర్నర్ డీవీఎస్.రామలింగరాజు అన్నారు. మంగళవారం బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార భాషను ప్రజల భాషగా మార్చడానికి గిడుగు చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా గౌతమ్ పబ్లిక్ స్కూల్ తెలుగు పండితురాలు భువనేశ్వరి, సుకన్యలను, అలాగే జాతీయ స్కేటింగ్ క్రీడా కారుడు వరుణ్‌కృష్ణ, క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సాయిబాబు, స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్.రామకృష్ణప్రసాద్, అధ్యక్షులు గుర్రం ఏడుకొండలు, కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్, మురళి కృష్ణ, బచ్చు మాధవి, స్కూల్ అధినేత శేఖర్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.